- లైలా యెర్నేని
- కూడికల వంశీధర్
- కనకం అనుపమా దేవి
- యోగానంద్ సరిపల్లి




చిత్రాలు: దెందుకూరి రఘునాథ్

## కలతలో నెలత

-లైలా యెర్నేని





నిర్బంధించకు నన్ను, మిత్రమా!
నిరంతరము నవ్వమనుచు;
నీ వెరుగనిదేమున్నది తెలుపను
దుర్భరమగు దుఃఖము లుండును సుమా!
విసుగొందకుము, నన్ను విడిచి పోకుము.
ఇప్పుడీ నాటికి ఇంత మౌనముగ ఉండనిమ్ము
ఒక్కింత నీ భుజమున తల వాల్చనిమ్ము
మరుగుతున్న గుండెను కరుగనిమ్ము
కరిగి జాలి కన్నీటి జాలుగా జారనిమ్ము.
కలత తీరినపుడు నే కలకల నవ్వుదు.
మరల మునుపటి రాగాల అనురాగాల
అందాల ఆనందాల నెలత నగుదు.
నీవె చెప్పితివి కాదా, నాకెన్నో మార్లు
వినదగునని నా నవ్వులనుచు:
నవ్వులు కావవి, వెన్నెల వేళలలో
చిన్నగాలి తోపు లూపగా వరుసగ
సొగసుగ, వరుసారసగ సొగసుగ
మంజులముగ, మనోరంజనముగ
మ్రోగెడి మువ్వలనుచు.
మరల మ్రోగును మధురముగ మిత్రమా!
వినబడునానవ్వుల మువ్వల మ్రోతలు
విందువులే వీనుల విందుగ నీవు
విడిచిపోకుము, వేచియుండుము.

## ఎదురుచూపు

కూడికల వంశీధర్



నీ కోసం ఎదురు చూడడం
నిరాశే ఎదురవడం
అలవాటైనా
పదే పదే అదే
పొరపాటు చేస్తున్నా

నిజం చెప్తున్నా...
ఎదురుచూపులో
ఆనందం అనుభవిస్తున్నా.



## డాంభికం!

కనకం అనుపమా దేవి



వేళ్ళను దాచీ కాయలను మోస్తున్నట్టు
చెట్టు!
నేలను దాచీ
రాళ్ళను మోస్తున్నట్టు
ఏరు!
మనసును దాచీ భావాలను
మోస్తున్నట్టు
కళ్ళు!
అంతరాత్మను దాచీ
ఆనందాలను మోస్తున్నట్టు
నేను !



## ఎందుకిలా!

- యోగానంద్





ఎందుకిలా! ఎందుకిలా!
ఏవేవో ఘోషలు వినబడతాయి,
ఎన్నెన్నో బాటలు కనబడతాయి!
ఎందుకిలా! ఎందుకిలా!
ఈ ఘోషల బాటలూ, బాటల ఘోషలూ
మనసునిలా తడబెడతాయి!
ఎందుకిలా! ఎందుకిలా!
మరీచికలు మదిని మరీ మురిపిస్తాయి!
కలరేపుచు వగచూపుచు, సంఘర్షణ రేగిస్తాయి!
ఎందుకిలా! ఎందుకిలా!
ఈ ఆకర్షణల సంఘర్షణలూ, సంఘర్షణల ఆకర్షణలూ
మనసునిలా కృంగదీస్తాయి!
ఎందుకిలా! ఎందుకిలా!
తీరలేని తీపి కలలు ప్రతి నిత్యం చిగురిస్తాయి,
కలలుగనే ఈ కవితలు అను నిత్యం వికసిస్తాయి!
ఎందుకిలా! ఎందుకిలా!
ఈ కలల కవితలూ, కవితల కలలూ
మనసునిలా ఊరిస్తాయి!
ఎందుకిలా! ఎందుకిలా!
లోకమాశతో ఎదురుచూస్తుంది
శాంతి లేక భ్రాంతిలోనే అనుక్షణం జీవిస్తుంది!
ఎందుకిలా! ఎందుకిలా!
ఈ ఆశల భ్రాంతుల లో, భ్రాంతుల ఆశలలో
కృంగి కృంగి విలపిస్తుంది....